INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(1), January :2021
Online Copy Available: www.ijmer.in

జానపద సామెతలు - జీవన మార్గదర్శకాలు

డా. రాపోలు శ్రీనివాస్,
తెలుగు సహాయాచార్యులు, తారా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), సంగారెడ్డి, తెలంగాణా రాష్ట్రం.
సెల్: 9848050694 Email: srinivas.rapolu**42**@gmail.com

వ్యాస సంగ్రహం

ఈ వ్యాసం జానపద సామెతల ప్రాముఖ్యతను, మానవ జీవితంలో వాటి మార్గదర్శకత్వాన్ని సమగ్రంగా వివరిస్తుంది. పెద్దల అనుభవసారాలుగా, జ్ఞానగుళికలుగా రూపుదాల్చిన సామెతలు మనిషి జీవితానికి మెరుగులు దిద్దడంలో, సమున్నతుణ్ణి చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని ఈ వ్యాసం పేర్కొంటుంది. సామెతల లక్షణాలు, వాటిలో కనిపించే పశుపక్ష్యాదుల ప్రతీకలు, మనస్తత్వ విశ్లేషణ, వేమన సూక్తులలో సామెతల ప్రభావం మరియు మానవ స్వభావంపై వంశపారంపర్య ప్రభావం వంటి అంశాలను ఇందులో విశదీకరించారు.

కీలక పదాలు: జ్ఞానగుళికలు, చద్దన్నం, లోకోక్తి, అలెన్ డండస్, మార్గదర్శకాలు.

ఉపోద్ఘాతం

''పెద్దల మాట చద్దన్నం మూట''. చద్దన్నం అంటే చల్ల (మజ్జిగ) అన్నం. ఈ చల్ల అన్నమే కాలక్రమేణా చద్దన్నంగా మారింది. మెత్తగా ఉడికించిన అన్నంలో పాలుపోసి కొద్దిగా మజ్జిగ కలిపి రాత్రంతా తోడుపెట్టి మరుసటి రోజు తినే అన్నమే చద్దన్నం. ఇది అనాదిగా వస్తున్న అలవాటు. పూర్వం బాటసారులు కాలినడకన ప్రయాణం చేస్తూ ఈ చద్దన్నాన్ని వెంట తీసుకుని వెళ్ళేవారు. మధ్యాహ్న సమయంలో మంచినీటి బావి, చెట్టునీడ ఉన్నచోట కూర్చుని వెంటతెచ్చుకున్న చద్దన్నం మూట విప్పి తిని, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ ముందుకు ప్రయాణాన్ని కొనసాగించేవారు. అలాగే జీవిత ప్రయాణంలో కష్టాలు, నష్టాలు, అడ్డంకులు, అవరోధాలు, సమస్యలు, సవాళ్ళు ఎదురైనప్పుడు పెద్దల మాటలను గ్రహించి, ఆలోచించి వారి సలహాలు, సూచనలకు అనుగుణంగా నడుచుకుంటే జీవిత ప్రయాణం నల్లేరుపై బండి నడకలా సాఫీగా సాగిపోతుంది. పెద్దల మాటలు అనుభవసారాలు, జ్ఞానగుళికలు. మానవుని దీర్ఘానుభవం ఆధారంగా రూపుదాల్చినవే సామెతలు. సామెతలు ప్రధానంగా

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(1), January :2021
Online Copy Available: www.ijmer.in

మానవ జీవితానికి మెరుగులు దిద్దే ప్రయత్నం చేస్తాయి. మనిషి సమున్నతుడు కావడానికి దోహదపడతాయి.

జానపదులు

జనపదం అంటే మనుషులు నివసించే చోటు, పల్లె అని అర్థం. జనపదాలలో నివసించేవాళ్ళు జానపదులు. జానపదులకు సంబంధించినది జానపదం. అది వస్తురూపంలో, భావరూపంలో, ప్రదర్శన రూపంలో ఉండవచ్చు. పల్లీయులు, గ్రామీణులు ఎక్కడ ఉంటే అక్కడ జానపదత్వం ఉంటుంది. వారు ఈనాడు కేవలం గ్రామాల్లోనే ఉండడం లేదు. నగరాల్లోనూ ఉంటున్నారు. అందువల్ల జానపదం ఈనాడు అంతటా ఉంది. మానవ జీవనానికి మూలం జానపదమేనని చెప్పవచ్చు. ప్రసిద్ధ జానపద విద్వాంసుడు అలెన్ డండస్ విస్తృతార్థంలో జానపదులంటే ఏదైనా ఒక్క విషయంలోనైనా భావసామ్యం కలిగిన జనసముదాయం అని చెప్పారు. వీరు ఒకే భాష, ప్రాంతం, జాతి, మతం, వృత్తికి సంబంధించినవారు కావచ్చు. తమదేనని చెప్పుకోవడానికి కొన్ని సంప్రదాయాలు వీరికి ఉంటాయి.

సామెతలు

జానపద విజ్ఞానంలోని అన్ని అంశాలలాగే సామెతలు కూడా సాంప్రదాయికమైనవి. సామెతలు మన ప్రాచీన సంస్కృతి, జ్ఞానం, అనుభవాలను ప్రతిబింబించే మాటలు. సామెత అనే పదం సామ్యత నుండి పుట్టింది. సామ్యం అంటే పోలిక అని అర్థం. చెప్పదలచుకున్న ఆలోచన అంతా వివరంగా చెప్పవలసిన పనిలేకుండా ఒక్క వాడియైన వాక్యంతో కొద్దిలో తేల్చివేసే మాటలే సామెతలు. అట్లాంటి సందర్భాలలో అవే మాటలను తరచు ఆ భాష మాట్లాడేవాళ్లు వాడుతూ ఉండడంవల్ల ఆ వాక్యాలకు చలామణి వస్తుంది. ప్రస్తుత సందర్భానికి సరిపోయే విధంగా, అటువంటి అనేక సందర్భాలకు కూడా సరిపోయేటట్టు సమాజంలో చలామణిలోకి వచ్చిన ఆ వాక్యాలు సూటిగా, చమత్కారంగా ఉండి ఆకర్షణీయకంగా ఉంటాయి. మన సందర్భాన్ని పోలిన మరొక సందర్భాన్ని తెలిపే వాక్యాలే సామెతలు అని చెప్పవచ్చు. ఉదా. ''**చవి ఎరిగిన కుక్క చావగొట్టినా పోదు**'' అనేది ఒక సామెత. వండిపెట్టుకున్న ఆహారాన్ని ఒక కుక్క వచ్చి రుచి చూసింది. ఆ రుచి మరిగిన కుక్క మాటిమాటికి వస్తుంది. ఎన్నిసార్లు కొట్టినా పోదు. అది సందర్భం. కాని ఈ సామెత ఉపయోగించే వాళ్ళు అన్నివేళలా కుక్కను గురించే చెప్పరు. అలాంటి ప్రవర్తనగల మనుషుల గురించి చెపుతూ ఈ సామెత చెప్తారు. ఒక లంచగొండి ఉద్యోగిగానీ, తప్పుడు పనులకు అలవాటు పడిన వారి గురించి, వాళ్ళ స్వభావం గురించి ఈ ఒక్క వాక్యంతో అర్థవంతంగా వివరించవచ్చు.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(1), January :2021
Online Copy Available: www.ijmer.in

సామెతలకు వివిధ పేర్లున్నాయి. నానుడులు, సుద్దులు, జనశ్రుతులు, శాస్త్రాలు, మాటలు, సాటువ, చాటువ, లోకోక్తి, జనవాదము, నుడికారం మొదలగునవి. హంగరీ భాషలో పెల్డబెగెడ్ అనీ, అరబ్బీ భాషలో మతల్ అనీ, ఆంగ్లంలో ప్రావెర్బ్ అనీ, సంస్కృతంలో సూక్తీ, సుభాషితమనీ, తమిళంలో పళమొళి అనీ, కన్నడంలో గాదె లేక నాణ్ణుడి అని అంటారు. రోగర్ డి. అబ్రహామ్స్ సామెతను నిర్వచిస్తూ ''సామెతలు సంక్షిప్తంగా, వివేకయతంగా ఉండే సాంప్రదాయిక అభివ్యక్తులు'' అంటాడు. "Short sentences drown from long experience" అని సెర్వాంటెన్ సామెతను నిర్వచించాడు. అనగా తరతరాల అనుభవం సృష్టించిన సంక్షిప్త వాక్యాలు సామెతలు అని అర్థం. ''ఒక పిండితార్థాన్ని కొద్ది మాటల్లో చెబుతుంది సామెత'' అని విశ్వనాథ చెప్పాడు. సంక్షిప్తంగా ఉండడం, ప్రచారంలో ఉండడం, ప్రభావవంతంగా చెప్పడం, ఒక భావాన్ని లేదా అంశాన్ని సుబోధకంగా, దృష్టాంత పూర్వకంగా చెప్పడం, చమత్కారంగా చెప్పడం, చెప్పిన అంశం లోకజ్ఞానానికి, జాతి అనుభవానికి సరిపడేదిగా ఉండడం, యతి, ప్రాసలు ఉండడం సామెతల లక్షణాలు.

''**కాకిపిల్ల కాకికి ముద్దు**''. 'తన' అన్న భావం ఉన్నచోట ప్రేమభావం పుట్టుకొస్తుంది. తన పిల్ల, తన వాళ్ళు, తన మాట, పాట, పని ఇవన్నీ వ్యక్తుల ప్రేమస్థానాలే. ఆ విషయాన్ని గూర్చి వ్యాఖ్యానించవలసి వచ్చినచోట ఈ సామెత ఉపయోగిస్తారు. ఈ వాక్యంలో సంక్షిప్తత ఉంది. ఇది ప్రచారంలో ఉన్న వాక్యం. ఇదే అర్థాన్ని 'కోతిపిల్ల కోతికి ముద్దు, గాడిదపిల్ల గాడిదకు ముద్దు'' అనే రకం వాక్యాల ద్వారా వెల్లడించే ప్రయత్నం చెయ్యవచ్చు. కాని, అవి ప్రచారంలో లేవు. ఇది ప్రచారంలో ఉంది. ఈ వాక్యం ద్వారా చెప్పదలచుకున్న అంశాల్ని అతికినట్లు చెప్పవచ్చు. ఈ సామెత వెల్లడించే సత్యం అందరూ గుర్తించేదే. అందరి అనుభవంలోనూ ఉన్న విషయమే ఇది. అందువల్ల పది మందీ అటువంటి సందర్భం వచ్చినప్పుడు ఈ వాక్యాన్ని పదేపదే వాడుతూ వస్తున్నారు. ఈ వాక్యంలో 'తన' అన్నచోట ఉండే ప్రేమ 'కాకి' మీద పెట్టి చెప్పడం జరిగింది. కాకిని దృష్టాంతంగా తీసుకుంటున్నాం. అట్లా చెప్పడం వల్ల ఆయా సందర్భాలలో మనకు కాకి, కాకిపిల్ల మనసుకు ప్రత్యేకంగా తట్టవు. ఆ మొత్తం వాక్యానికున్న భావమే స్ఫురిస్తుంది. ఇది అలంకారిక శైలికి ఒక లక్షణం. ఈ విధంగా ఇది 'సామెత', 'లోకోక్తి' అనిపించుకుంటుంది. 'కాకిపిల్ల కాకికి ముద్దు' అన్నప్పుడు కా, కా అని రెండుసార్లు రావడంలో ధ్వని సంబంధమైన అందం వచ్చింది. ఒకే అక్షరాన్ని మళ్ళా కొంత దూరంలో తిరిగి వాడినా లేదా ఆ అక్షరానికి ధ్వని సామ్యం ఉన్న అక్షరాన్ని వాడినా దానిని 'యతి' అంటారు. ఒక్కొక్కసారి మైత్రి స్థానంలో మొదటి అక్షరంగా కాక రెండోది ఉండొచ్చు. ఉదా. ''**ఎంత చెట్టుకు అంత గాలి**''. దీనిని ప్రాస అంటారు. ఈ విధంగా యతిగాని, ప్రాసగాని సామెతలలో కనబడతాయి. వీటి వల్ల సామెతలు నోటి గుర్తుంటాయి.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(1), January :2021
Online Copy Available: www.ijmer.in

ఉదా. **'పెళ్ళికి వెళ్తూ, పిల్లని చంకన బెట్టుకు వెళ్లాడట', 'మెరిసేదంతా మేలిమి కాదు', 'బతకని బిడ్డ బారెడు', 'అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో', 'ఊరంతా ఒక దారి ఉలిపి కట్టెది ఒక దారి', 'అదుగో పులి అంటే ఇదుగో తోక'** అన్నట్లు మొదలగునవి.

సామెతలు ధ్వని ప్రధానాలు. అంటే ప్రత్యక్షంగా కంటే పరోక్షంగా భావవ్యక్తీకరణ చేస్తాయి. ఇలాంటి పరోక్ష భావవ్యక్తీకరణ కోసం ప్రతీకలుగా సామెతల్లో పశుపక్ష్యాదుల్ని తీసుకురావడం జరుగుతుంది. ఉదా. **'ఏనుగును చూసి కుక్కలు మొరిగినట్లు'.** ఇందులో ఏనుగు ఏనుగే కాదు. గొప్పవాడు, బలవంతుడు, సజ్జనుడు అయిన వ్యక్తి. కుక్క కుక్కే కాదు. అల్పుడు, బలహీనుడు, దుర్జనుడు. ఇలాగే నక్క కపటానికి, యుక్తికి, పాము పగకు, దుర్జనత్వానికి, క్రౌంచు కృతఘ్నతకు, సింహం, పులి అభిమానానికి, మేక మెతకతనానికి, గొర్రె అమాయకత్వానికి, కప్ప అజ్ఞానానికి, కోతి చాంచల్యానికి, చిలుక అనుకరణకు ఇలా సామెతలలో ఎన్నో ప్రతీకలుగా చెప్పబడ్డాయి.

మానవుని స్వభావం మనస్సు ననుసరించే ఉంటుందంటాడు వేమన. **'ఏ వంక మనసు కలిగిన – నా వంకకు నింద్రియంబు లన్నియు నేగున్'** అంటాడు. మంచి చేసినా, చెడు చేసినా మనస్సే ప్రధానం. మనసుకు నచ్చితే ఎంతో కష్టమైన పనైనా చేస్తారు. నచ్చకపోతే ఎంత సులభమైనా చేయరు. **మనసుంటే మార్గముంటుంది'** ఇంద్రియాలన్నీ మంచిలోగానీ, చెడులోగానీ ప్రవర్తించడానికి మనస్సే కారణం. ఆ మనస్సు నిగ్రహించి ఆధీనంలో పెట్టుకోవాలి. మానవుని స్వభావంపై ప్రభావం చూపే మనస్సు చంచలమైనది. క్షణక్షణానికి మారిపోతూ ఉంటుంది. దాని గమనానికి హద్దులుండవు, కట్టుబాట్లుండవు. గాలికంటే వేగంగా పరుగెడుతుంది. మనోవేగాన్ని మించింది లోకంలో మరొకటి లేదు. చంచలమైన మనస్సును స్వాధీనం చేసుకోవడానికి నిరంతర సాధన చేయాలి. లోకంలో దేన్నైనా అర్థం చేసుకోవచ్చు, కానీ మనస్సును అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. మనస్సు నరకాన్ని స్వర్గంగా, స్వర్గాన్ని నరకంగా భావింపచేస్తుంది. మానవుని మనస్సు అద్దం లాంటిది. దాన్ని అతి సున్నితంగా చూసుకోవాలి. మనస్సనే అద్దం పగిలితే తిరిగి అతికించడం సాధ్యంకాదు. శరీరానికి తగిలిన గాయాన్ని మాన్పవచ్చుగానీ, మనసుకు గాయమైతే మాన్పలేమని భారతసూక్తి. ఆడవారి మనస్సు చంచలమైనదని అంటారు. క్షణక్షణం మారిపోతూ ఉంటుంది. వారి మనస్సును అర్థం చేసుకోవడం సృష్టికర్త బ్రహ్మకైనా సాధ్యంకాదంటారు. ఇలాంటి సామెతలు ఎన్నో మనసు స్వభావం గురించి వివరిస్తాయి.

'మనస్సుకు మనస్సే సాక్షి',

'బావి లోతును చూడవచ్చును గానీ, మనస్సు లోతును చూడకూడదు',

'మనసు విరిగెనేని మరియంటనేర్చునా?',

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(1), January :2021
Online Copy Available: www.ijmer.in

'మనసున నాటిన మాటలు చెరపలేరు',

'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్'

మానవులంతా ఒకటే అయినా వాళ్ళ ప్రవర్తనను బట్టీ, మాటతీరును బట్టీ, సజ్జనులనీ, దుర్జనులనీ వేమన రెండు విధాలుగా విభజించాడు. **పురుషులందు పుణ్యపురుషులు వేరయా, జిహ్వాకో రుచి పుత్రికో బుద్ధి, బుద్ధి కర్మానుసారిణి** మొదలగు సామెతలు మానవుల స్వభావాన్ని చెబుతున్నాయి. వేమన పద్యాల మూడవ పాదాలు చాలావరకు సామెతల వంటివే. వేమన జీవితానుభవంతో కవిత చెప్పినవాడు కావడంచేత అనుభవ మూలమైన సామెతలు వేమన సూక్తులలో కోకొల్లలుగా కనిపిస్తాయి. ఈ వాక్యాలు వేమనను అచ్చమైన ప్రజాకవిగా చేశాయి. **భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు, అనువుగాని చోట అధికులమనరాదు, పదుగురాడు మాట పాటియై ధరజెల్లు, ఊరకుండువాని కూరెల్ల నోపదు, స్థానబల్మికాని తన బల్మికాదయా, చెప్పు తినెడి కుక్క చెఱుకు తీపెరుగునా, తప్పులెన్నువారు తమతప్పు లెరుగరు, కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా, విత్తనంబు మర్రి వృక్షంబునకు నెంత, సాధనమున పనులు సమకూరు ధరలోన, మనసు విరిగెనేని మరియంట నేర్చునా, పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా, బలిమిలేని వేళ పంతంబు చెల్లదు,**

ఎవడి కర్మ వాడు అనుభవింపక తప్పదు మానవుడు ఎంతటివాడైనా కర్మఫలాన్ని అనుభవించక తప్పదని ఈ సామెత చెబుతుంది. ప్రకృతి మానవ స్వభావంపై మిక్కిలి ప్రభావాన్ని చూపిస్తుంది. ప్రకృతి మానవునికి ప్రథమ గురువు. మానవుని పరిశీలనా జ్ఞానం ప్రకృతి వల్లనే పెరుగుతుంది. ప్రకృతిలోని వివిధ పదార్థాలను, సన్నివేశాలను పరిశీలించే మానవుడు తన జీవితాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దుకుంటాడు. తల్లిదండ్రుల శారీరక లక్షణాలు వంశపారంపర్యంగా పిల్లలకు సంక్రమిస్తాయి. తల్లిదండ్రుల స్వభావం, ప్రవర్తన పిల్లలపై ప్రభావం చూపిస్తుందని సామెతలు వెల్లడి చేస్తాయి. **ఆవు చేలో మేస్తే, దూడ గట్టున మేస్తుందా?, తల్లికి బొల్లి వుంటే, పిల్లకు చుక్క అయినా ఉంటుంది, ఆ తండ్రికి కొడుకు కాడా? ఆ తల్లికి కూతురు గాదా?, ఆ గుడ్డలోదే ఆ పేలిక, ఆ కట్టెలోదే ఆ పేడు, తల్లిని బట్టి పిల్ల, విత్తును బట్టి పంట, పులి కడుపున లేడి పుడుతుందా?, గోధుమలు వేస్తే బాదములు పండునా?, చిక్కుడు తీగకు బీరకాయ కాస్తుందా?, పనివాని కడుపున తినువాడు పుట్టినట్లు** తల్లిదండ్రుల లక్షణాలే పిల్లలలో ఉంటాయనే విషయాన్ని తెలియజేస్తున్నాయి.

అలాగే పిల్లల స్వభావం, మొండి ప్రవర్తన, అలవాట్లు, మార్పులు, బుద్ధివికాసం, అనుకరణ మొదలగు వానిని ఎన్నో సామెతలు వివరిస్తున్నాయి. **చంక కెక్కిన పిల్ల చచ్చినా దిగదు, మొక్కై వంగనిది మానై వంగునా, అడ్డాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడా బిడ్డలా?, కనిపెంచిన నాడు కొడుకులు గాని కోడలు**

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(1), January :2021
Online Copy Available: www.ijmer.in

వచ్చాక కొడుకులా?, ఏండ్లు ఎగసన – బుద్ధి దిగసన, అరవై యేండ్లయితే అరులు మరలు, అరవై ఏండ్లు నిండిన వాడిని ఆలోచన అడక్కు – ఇరవై ఏండ్లు నిండని వానికి పెత్తన మీయకు.

ముగింపు

'సామెత లేని మాట – ఆమెత లేని యిల్లు' అన్నట్లు మాటలకు సూటిదనం, వాడి వేడి, తీక్ష్ణత సామెతలు తీసుకొస్తాయి. ఒక్కొక్క సామెతలో అనుభవం వెనుక ఒక పరిపూర్ణ జీవిత సత్యం దాగి ఉంటుంది. ఒక సంపూర్ణ జీవిత సారమంతా సామెతలో ఉంటుంది. పూర్వం గ్రామ పెద్దలు పంచాయితీ తీర్పులు చెప్పేటప్పుడు మంచి సామెతతో యిరువర్గాల వారి సమస్యలను పరిష్కరించేవారు. కోర్టుల్లో న్యాయమూర్తులు కూడా తమ తీర్పులను సామెత నుపయోగించి చెబుతారు. A good example is the best sermon అన్నట్లు సామెతలు నిత్యజీవితంలో అనుసరించదగిన మార్గదర్శకాలు.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. డా. సుందరం, ఆర్వీయస్. (1983). ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి, హైదరాబాద్.
2. మోహన్, జి.ఎస్. (2001). జానపద విజ్ఞానాధ్యయనం, శ్రీనివాస పబ్లికేషన్స్, బెంగుళూరు.
3. డా. రామరాజు, బిరుదురాజు. (1978). తెలుగు జానపద గేయ సాహిత్యం, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాద్.
4. రచయితల బృందం. (1997). తెలుగు మౌలిక అంశాలు, డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.